క్లుప్తంగా

3న మండల సర్వసభ్య సమావేశం

నాగులుప్పలపాడు: మండల సర్వసభ్య సమావేశాన్ని మార్చి 3వ తేదీన ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఏ.వి. కుమారి తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులతో పాటు అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలని తెలిపారు.

మందా యలమందకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు

చీమకుర్తి: మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మందా యలమంద చిత్రపటానికి గురువారం జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, గిరిజన సంఘం జిల్లా నాయకుడు పేరం శ్రీనివాసరావు, పిన్నిక శ్రీనివాసరావు, దాసరి రవి, చింతలపాలెం బాబు, స్థానిక నాయకులు నివాళులర్పించారు. యలమంద ఇటీవల అనారోగ్యంలో మృతి చెందటంతో దశ దిన కర్మ సందర్భంగా నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రథమ బహుమతి


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జయ, అధ్యాపకులు

చీమకుర్తి: జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో చీమకుర్తి బాలికల గురుకుల సంక్షేమ పాఠశాల ప్రథమ బహుమతిని గెలుచుకుంది. పదో తరగతికి చెందిన విద్యార్థిని బి.హరిత సాఫ్ట్ యాప్‌లో తన నైపుణ్యాలను ప్రదర్శించింది. గురువారం ఒంగోలులోని సెయింట్ జేవియర్స్ పాఠశాలలో జేసీ, డీఈఓ చేతుల మీదుగా హరిత ప్రథమ బహుమతిని గెలుచుకున్నట్లు చీమకుర్తి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.జయ గురువారం చీమకుర్తిలో తెలిపారు. ఫిజిక్స్ టీజీటీ.. కృష్ణప్రియను అభినందించారు.

సబ్ సెంటర్ వినియోగంలోకి రాదా?


సబ్ సెంటర్ శిలాఫలకం

ఒంగోలు రూరల్: కరవది గ్రామంలో ప్రస్తుతం జగనన్న కాలనీలు ఎస్టీ, బీసీ కాలనీ రెడ్డిపాలెం కాలనీ మధ్యన నిర్మించిన సబ్ సెంటర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని జగనన్న కాలనీ వాసులు, సమీప ప్రాంత వాసులు కోరుతున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి 21 జూలై 2011 న ఈ సబ్ సెంటర్‌ను అప్పటి డీఎంహెచ్‌వో కె.సుధాకర్‌బాబు వేములపాడు మెడికల్ ఆఫీసర్ డా. వాణి చొరవతో ఏర్పాటు చేసిన ఈ సబ్ సెంటర్‌ను నాడు ప్రారంభించారు. నాటి నుంచి వినియోగంలో లేకపోవడంతో విలువైన సామగ్రి, పడకలు, ఫ్లోరింగ్ శిథిలమయ్యాయి.

పెట్రోలు బంకు తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

ఒంగోలు టౌన్: జిల్లా కారాగారం ప్రాంగాణంలో ఖైదీలచే నడుస్తున్న ఐఓసీయల్ అవుట్‌లెట్ పెట్రోలు బంకును అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ఏ.ఉదయ భాస్కర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ డి.యస్.యస్.రామకృష్ణ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ యస్వీయస్ రామకృష్ణ తనిఖీ నిర్వహించారు. జైలు పర్యావేక్షణాధికారి పి.వరుణారెడ్డి, జైలర్ జి.ఎరికినాయుడు, డిప్యూటీ జైలర్ కె.యలమందయ్య, సీనియర్ అసిస్టెంట్ సుభాని, చీఫ్ వార్డర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

దర్శి: సైబర్ నేరగాళ్లతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి సూచించారు. దర్శి సర్కిల్ కార్యాలయం పరిధిలోని సైబర్‌నేరాల గురించి ఆయన మాట్లాడుతూ ఏటీఎం కార్డు తీసుకుని మనీ విత్ డ్రా చేస్తామని పిన్ నంబర్ సేకరించి చివరకు మనీ విత్‌డ్రా అవటం లేదని, వారికి వేరొక ఏటీఎం కార్డు ఇచ్చి మోసం చేస్తున్నారని చెప్పారు. ఉపగ్రహాల వ్యవస్థను ఛిద్రం చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నారన్నారు. అత్యంత సున్నితమైన సమాచారాన్ని తస్కరిస్తున్నారని తెలిపారు.

తీరంలో విద్యుత్ వెలుగులు

- యుద్ధప్రాతిపదికన విద్యుదీకరణ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు


జగనన్న కాలనీలో హైటెన్షన్ విద్యుత్ లైన్

ఒంగోలు రూరల్: నియోజకవర్గం తీరప్రాంత గ్రామాల్లో దశాబ్దాలనాటి విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, కండెన్సర్లు, విద్యుత్ వైర్లు తొలగించి.. కొత్తగా చేపట్టిన విద్యుద్దీకరణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. గత ప్రభుత్వాల కాలంలో చిరుగాలికి తెగిపోయే విద్యుత్ తీగలు చిగురుటాకు తగిలితే ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ఫ్యూజ్‌లు ఎగిరిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. దీనిపై నాటి ప్రభుత్వాలకు ఎన్ని సార్లు విన్నవించినా అరణ్య రోదనగానే మిగిలిపోయింది. తీరప్రాంత గ్రామాల్లో తరచూ తుఫాన్లు రావడం, వరదలు ఏర్పడడం, భారీ గాలులకు తీగలు తెగిపోయి పునరుద్ధరణకు రోజులు తరబడి అంధకారం ఏర్పడేది. ప్రస్తుతం రీజనల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సాధించి రూ.23 కోట్లను కొత్తపట్నం తీరప్రాంత గ్రామాల విద్యుత్ ఆధునికీకరణ పథకానికి కేటాయించారు. ఇందులో భాగంగా నూతన స్తంభాలు, నూతన విద్యుత్ తీగలు ఏర్పాటు చేశారు. సిమెంటు దిమ్మెలను ఏర్పాటు చేసి వాటిపై నూతన ట్రాన్స్‌ఫార్మర్‌లు, కండెన్సర్లు ఏర్పాటు చేశారు. పనులు విషయంలో ఏలాంటి రాజీ లేకుండా నాణ్యమైన పద్ధతులు అవలంబించారు. కోస్తా తీర ప్రాంతంలో వాయుగుండం ఏర్పడి తుఫానుగా మారి, తీరం దాటే సమయంలో వీచే బలమైన గాలులకు సమయంలో కూడా విద్యుత్ సరఫరా చేయగలిగే సామర్థ్యం ఉండేలా పటిష్టంగా రూపొందించడంలో ఒంగోలు ఆపరేషన్స్ విద్యుత్ ఏడీఈ రాయపూడి మోహన్ చర్యలు తీసుకున్నారు. ఒంగోలు రూరల్ ఏఈ, కొత్తపట్నం విద్యుత్ ఏఈ సహకారంతో విద్యుత్ ఆపరేషన్స్ లైన్‌మేన్లతో పాటు సచివాలయ విద్యుత్ సహాయకులు అంకితభావంతో పనిచేయడంతో కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

నిధుల కేటాయింపుతో కష్టాలకు చెల్లు



రూ.23 కోట్లతో రీజనల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఒంగోలు నియోజకవర్గంలోని తీరప్రాంత గ్రామాలున్న ఒంగోలు రూరల్ మండలం, కొత్తపట్నం మండలం గ్రామాల్లో నూతన విద్యుద్దీకరణ పథకానికి ఎమ్మెల్యే నిధులు కేటాయించారు. ఎమ్మెల్యే బాలినేని నిధులు కేటాయించడం వలన తీరప్రాంత గ్రామాల్లోని దశాబ్దాలనాటి విద్యుత్ తీగలు కండెన్సర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తిగా తొలగించి వేసి నూతనంగా విద్యుత్ పరికరాలను, విద్యుత్ తీగలను ఏర్పాటు చేశాం. ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది.
– **రాయపూడి మోహన్‌రావు**, రూరల్ ఏడీఈ విద్యుత్ రూరల్-2: ఒంగోలు రూరల్ ఏడీఈ ఆపరేషన్స్

పలు ప్రాంతాల్లో..

రూరల్ మండలంలోని గ్రామాల్లో పాడుబడిన స్తంభాలు స్థానే నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో భాగంగా 20 స్తంభాలు త్రోవగుంటకు, 15 స్తంభాలు కరవది, వలేటివారిపాలెం 15, పెళ్ళూరు 15, వెంగముక్కలపాలెం 15, సర్వేరెడ్డిపాలెంలో 15 స్తంభాలు ఏర్పాటు చేస్తున్నాం.
– **ఆర్‌ఆర్ చెన్నారెడ్డి**, ఒంగోలు రూరల్ ఏఈ

బాలినేనికి కృతజ్ఞతలు




బాలినేనిని సత్కరిస్తున్న గోలి తిరుపతిరావు, బాలినేనికి పుష్పగుచ్ఛం అందిస్తున్న తమ్మినేని మాధవి

ఒంగోలు: వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులుగా తనకు పదవి కేటాయించడం పట్ల గోలి తిరుపతిరావు గురువారం వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, స్థానిక ఎంఎల్ఏ బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బాలినేనిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. తనకు కేటాయించిన పదవికి తప్పకుండా న్యాయం చేస్తానని, బీసీలందరినీ సమైక్యం చేస్తూ ప్రతి ఒక్కరికీ అండగా ఉండాలని బాలినేని ఈ సందర్భంగా తిరుపతిరావుకు సూచించారు. బీసీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు కటారి శంకరరావు, గంటా రామానాయుడు, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి కరుణాకర్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ మారెళ్ల శ్రీదేవి శ్రీనివాస్, మేదర సంఘం అధ్యక్షులు కేత చలపతిరావు తదితరులు గోలి తిరుపతిరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

బాలినేనికి సత్కారం

వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, స్థానిక శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆయన నివాసంలో గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి ఘనంగా సత్కరించారు. పదవిని బాధ్యతాయుతంగా నిర్వహించి మహిళలకు పార్టీని అత్యంత దగ్గర చేయాలని బాలినేని ఈ సందర్భంగా ఆమెకు సూచించారు. తనకు పదవి రావడానికి కారకులైన మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేటర్లు తాడి కృష్ణలత, పెద్దిరెడ్డి నియంత కుమారి, వేమూరి భవాని, మహిళా నాయకురాలు పల్లా అనూరాధ, బైరెడ్డి అరుణ, చింతగుంట్ల సువర్ణ, బేతపూడి రాజేశ్వరి, మాతాశిశు వైద్యశాల డైరెక్టర్ సాధం విజయలక్ష్మి, మరియమ్మ, గృహలక్ష్మి, అంజలి, పద్మావతి, లీలా మొదలైన వారు పాల్గొన్నారు.

హిందూ ఆరామ క్షేత్ర సహకారానికి అభినందనలు

స్థానిక గోపాలనగరంలో నూతనంగా నిర్మించదలిచిన హిందూ ఆరామ క్షేత్రానికి సహాయ సహకారాలు అందించినందుకు స్థానిక శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డికి పలువురు అభినందనలు ప్రకటించారు. గురువారం స్థానిక గోపాలనగరంలో జరిగిన ఈ కార్యక్రమం 5వ డివిజన్ కార్పొరేటర్ ఎందేటి పద్మావతి రంగారావు, 6వ డివిజన్ కార్పొరేటర్ చల్లా తిరుమలరావు, 3వ డివిజన్ కార్పొరేటర్ గండు ధనలక్ష్మి మధు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు హిందూ ఆరామ క్షేత్రం నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. సీహెచ్ సత్యన్నారాయణరెడ్డి, నాగబాబు, పటాపంజుల శ్రీనివాసరావు, గుర్రం వెంకయ్య, తంజావూరి శ్రీనివాసరావు, కాలే వెంకటేశ్వర్లు, సీహెచ్ వెంకటేశ్వర్లు, కేతా చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కూలీల హాజరు శాతం పెరగాలి


ఈదుమూడిలో కూలీలతో మాట్లాడుతున్న పీడీ శీనారెడ్డి

నాగులుప్పలపాడు: క్షేత్ర స్థాయిలో ఉపాధి పనుల్లో కూలీల భాగస్వామ్యం పెరగాలని డ్వామా పీడీ శీనారెడ్డి తెలిపారు. ఈదుమూడిలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించి మాట్లాడారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులు మొదలయ్యాయని దీనికి అనుగుణంగా కూలీలు పనికి రావాలని కోరారు. అలాగే ఎవరైనా కూలీలు పని కావాలని కోరితే వెంటనే డిమాండ్ పెట్టి ఉపాధి పని చూపించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఇప్పటి వరకు జరిగిన పనులను పరిశీలించారు. కూనం పూర్ణచంద్రరావు, సర్పంచ్ బోలే లక్ష్మీ వీరాంజనేయులు, ఏపీవో ధనుంజయ్, ఈసీ విజయలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

కొత్తపట్నం: యువతి అదృశ్యం కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపట్నం మండలం మడనూరు గ్రామం ఎస్టీ కాలనీకు చెందిన మల్లవరపు ప్రసన్న ఒంగోలు దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నాలుగో సంత్సవం చదువుతోంది. ఆర్టీసీ బుస్సులో కాలేజీకు వెళ్లి సాయంత్రానికి తిరిగి వస్తుంటుంది. ఈ నెల 20న వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తండ్రి మల్లవరపు సుబ్బారావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చాడు. ఎస్సై కొక్కిలగడ్డ మధుసూదన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత


మాట్లాడుతున్న హర్షప్రీతమ్‌దేవ్ కుమార్

ఒంగోలు: మొక్కలు నాటడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని, దీనిని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని నేషనల్ సర్వీస్ స్కీమ్(ఎన్.ఎస్.ఎస్) జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో తొలుత మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పరీక్షల సమయంలో ఒత్తిడిని ఎదుర్కోవడం ఎలా అనే దానిపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని చక్కని విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. ఎంత ఎదిగినా ప్రకృతిని మరువరాదని, పర్యావరణాన్ని మనం కాపాడితనే ప్రకృతి మనలను కాపాడుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ టి.సురేష్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదం జరిగిన సెంట్రల్ కేఫ్ ప్రాంతం

ఒంగోలు టౌన్: నగరంలోని చర్చి సెంటర్లో గల సెంట్రల్ కేఫ్‌లో గురువారం రాత్రి 8 గంటల ప్రాంతంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. కేఫ్ ముందు భాగంలో పొగలు దట్టంగా వ్యాపించి మంటలు రేగడంతో అక్కడ కూర్చొని టీ తాగుతున్నవారు భయంతో పరుగులు తీశారు. వెంటనే అప్రమత్తమైన హోటల్ సిబ్బంది విద్యుత్ మీటర్లను ఆఫ్ చేశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. దీంతో ఎలాంటి నష్టం జరగలేదు.

రీ సర్వే వేగంగా చేపట్టాలి

- ఎస్‌డీజీ, పీఎం-జేఏవై సర్వేపై ఆరా
- సత్యనారాయణ పురం సచివాలయ పరిధిలో రూ. 57 లక్షల పన్ను వసూలు చేయాలి
- సిబ్బందితో సమీక్ష నిర్వహించిన కమిషనర్ వెంకటేశ్వరరావు


సిబ్బందితో సమీక్షిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ అంగిరేకుల గురవయ్య

ఒంగోలు సబర్బన్: సత్యనారాయణపురం వార్డు సచివాలయం పరిధిలో మొత్తం అసైన్‌మెంట్ వేగంగా రీసర్వే చేపట్టాలని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. గురువారం సత్యనారాయణపురంలో పర్యటించి.. పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా సచివాలయ పరిధిలో జరుగుతున్న రీ సర్వే గురించి ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది ఎవరూ తనకు తెలియకుండా సెలవు పట్టకూడదన్నారు. సచివాలయ పరిధిలో జరుగుతున్న ఎస్‌డీజీ సర్వే, పీఎం-జేఏవై సర్వే పురోగతి తక్కువగా ఉన్నందున సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వేలు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం కలెక్టర్ నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో పీఎం-జేఏవై గురించి, సర్వే పురోగతి గురించి అడిగి తెలుసుకుంటున్నారని గుర్తు చేశారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ పథకంలో భాగంగా గవర్నమెంట్ వారు వసూలు చేస్తున్న యూజర్ ఫీజు కలెక్షన్స్ గురించి వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో చర్చించారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటిపన్ను, కుళాయి పన్నులు వసూలు చేయాలన్నారు. సత్యనారాయణపురం వార్డు సచివాలయ పరిధిలో మొత్తం రూ. 1.27 కోట్లు వసూలు చేయాల్సి ఉందని, అందులో రూ. 70 లక్షలు వసూలు చేశారని, మిగతా రూ. 57 లక్షలు మార్చి నెలాఖరుకల్లా వసూలు చేయాలన్నారు. సచివాలయ పరిధిలో అధిక మొత్తంలో బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని ఆర్ఐని ఆదేశించారు. ఈ సందర్భంగా 49వ డివిజన్ కార్పొరేటర్ అంగిరేకుల గురవయ్య మాట్లాడుతూ 60 అడుగుల రోడ్డులో పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఏసీపీ కే.వెంకటేశ్వర్లు, ఎంఈ కె. మాల్యాద్రి, ఏఈ అంజిరెడ్డి, ఎంహెచ్ఓ మనోహర రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ పిచ్చయ్య, రెవెన్యూ సిబ్బంది అమ్మిరెడ్డితో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా లేఅవుట్‌లు వేస్తే కఠిన చర్యలు

మద్దిపాడు: మండలంలో అక్రమ మార్గంలో లేఅవుట్లు వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. మండల పరిధిలో ఉన్న పట్టా భూముల్లోని లేఅవుట్లు ఏర్పాటు చేయదలచుకున్న భూయజమానులు, భూముల విస్తీర్ణానికి సంబంధించిన రికార్డును ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలన చేయించుకుని ఆభూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకోవడానికి వారి వద్ద ఉన్న రికార్డులు, మార్కెట్ విలువ ఆధారంగా ప్రభుత్వ నిబంధనల మేరకు చెల్లించిన మొత్తానికి సంబంధించిన చలానా తనిఖీ చేయించుకోవాలన్నారు. ఈ విషయాలు పూర్తయిన తరువాత మాత్రమే లేఅవుట్లు వేసుకోవాలని తెలిపారు. భూయజమానులు ప్రభుత్వ భూములను వెంచర్ల సరిహద్దుల్లో ఉన్న డొంకలు, రోడ్లు, కాలువలు మొదలైన మౌలిక సౌకర్యాలకు ఎటువంటి ఆటంకం కలిగించినా వారిపై కఠిన చర్యలు తీసుకుని అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. వెంచర్లు ఏర్పాటు చేసే సమయంలో సంబంధిత అధికారుల వద్ద పూర్తి అనుమతులు పొందిన తదుపరి మాత్రమే లేఅవుట్లు, ఇతర వ్యవసాయేతర వినియోగానికి ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈక్రమంలో మండల పరిధిలో ఉన్న గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులకు వారి పరిధిలో ఉన్న వెంచర్‌లను పరిశీలించి మండల తహసీల్దార్ కార్యాలయంలో నివేదిక అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా వారి అనుమతులు రద్దు చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.

ఒలింపియాడ్ పరీక్షల్లో మాంటిస్సోరి సత్తా


మాంటిస్సోరి విద్యార్థులు


ఒంగోలు: తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షల్లో తమ విద్యార్థులు ర్యాంకులు కైవసం చేసుకున్నారని మాంటిస్సోరి విద్యాసంస్థ చైర్మన్ ప్రకాష్ బాబు, కరస్పాండెంట్ శబరీనాథ్‌లు పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ స్పెక్ట్రం హైదరాబాద్, ఐఐటీ అకాడమీ నిర్వహించిన పరీక్షల్లో 9 మంది ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారన్నారు. రూ. 6500, రూ. 4700, రూ. 3600 వరుస స్థానాల్లో నిలిచిన అందరికీ అందించారని చెప్పారు.

పేస్ కాలేజీలో ముగిసిన వర్క్‌షాప్


పేస్ కాలేజీ వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థినులు

ఒంగోలు: స్థానిక పేస్ కాలేజీలో గత మూడు రోజులుగా జరిగిన వర్క్‌షాప్ గురువారంతో ముగిసింది. ఎడ్యుస్కిల్స్, ఎడ్యుస్కిల్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వివేక్ రంజన్ విభిన్న క్లౌడ్ టెక్నాలజీలపై అవగాహన కల్పించగా, పాలో ఆల్టో కంపెనీ గ్లోబల్ ఆపరేషన్ అనలిస్ట్ అభిర్ నాయక్ మాట్లాడారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ సాంకేతికకు సంబంధించిన వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. అమెజాన్ వెబ్ సర్వీస్ సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్ చీమకుర్తి దీప్తి మాట్లాడుతూ క్లౌడ్ రంగంలో ఉన్న ఉపాధి అవకాశాల గురించి వివరించారు. ముగింపు సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న పేస్ కాలేజీ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఏడబ్ల్యూఎస్ సర్టిఫికేషన్ పూర్తిచేయడం వల్ల విద్యార్థులకు ఉద్యోగ, అవకాశాలు మరింత పెరుగుతాయన్నారు. ప్రిన్సిపాల్ జీవీకే మూర్తి, డీన్ స్టూడెంట్ ఆఫైర్స్ ఆర్.వీరాంజనేయులు, డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కె.రూప తదితరులు పాల్గొన్నారు.

మాగుంట రాఘవరెడ్డి అరెస్టు రాజకీయ కుట్ర


మాట్లాడుతున్న సింగరాజు రాంబాబు

ఒంగోలు: ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి అరెస్టు ముమ్మాటికి కేంద్ర రాజకీయ కుట్రలో భాగమే అని ఒంగోలు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సింగరాజు రాంబాబు అన్నారు. గురువారం స్థానిక బండ్లమిట్టలోని తన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విధానాలు తనకు తెలిసినంతవరకు ఎగుమతులు, దిగుమతులకు సంబంధించి ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిన సమయంలో జోక్యం చేసుకుంటుందన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతం రాఘవరెడ్డిని అరెస్టుచేశారని, వాస్తవానికి మన జిల్లాలో సైతం చైనా ఉల్లి, పెన్నులు, ఆఫ్ఘనిస్తాన్ నుంచి డ్రైఫ్రూట్స్ వస్తున్నాయన్నారు. వీటన్నింటికి కూడా బిల్లులు చూపించాలంటే ఎవరి వద్ద ఉంటాయని, మచ్చలేని మాగుంట కుటుంబంపై దారుణమైన మరక వేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏపీజీబీ ఖాతాదారుల సమావేశం

తర్లుపాడు: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఖాతదారుల సమావేశం తర్లుపాడులోని ఆ శాఖ ఆవరణలో గురువారం నిర్వహించారు. సమావేశానికి నంద్యాల రీజనల్ మేనేజర్ ఎస్.నవీన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తర్లుపాడు శాఖ ప్రారంభించి ఆరేళ్లయిందని, రూ.40 కోట్ల టర్నోవర్‌తో దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ఇతర బ్యాంక్‌ల కంటే డిపాజిట్లపై అధిక వడ్డీగా 7.80 శాతం చెల్లిస్తున్నట్లు చెప్పారు. బ్యాంక్ మేనేజర్ పీవీ రామకృష్ణరావు, అసిస్టెంట్ మేనేజర్ హెప్సిబా, క్యాషియర్ అనూష, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు. క్రాంతి పథం ఏపీఎం పిచ్చయ్య, రీజినల్ మేనేజర్‌ను ఘనంగా సత్కరించారు.

త్రోవగుంట ఫ్లైఓవర్‌పై లారీల ఢీ


క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న రెస్క్యూ టీం

ఒంగోలు టౌన్: నిద్రమత్తులో వేగంగా ఐషర్ వాహనాన్ని నడిపి ముందు వెళుతున్న లారీని ఢీకొట్టిన ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..కృష్ణపట్నం నుంచి బొగ్గులోడుతో పెన్నాకు వెళుతున్న లారీని చెన్నై నుంచి హైదరాబాద్ వెళుతున్న ఐషర్ వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. త్రోవగుంట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై జరిగిన ప్రమాదంలో ఐషర్ వాహనం నుజ్జునుజ్జయింది. లారీలోని డ్రైవర్ భూదత్తన్ కాలు క్యాబిన్‌లో ఇరుక్కుపోయింది. సమాచారం అందుకున్న తాలుకా సీఐ శ్రీనివాసరెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని అగ్నిమాపకదళ సిబ్బందిని రంగంలోకి దించారు. సమారు గంటసేపు శ్రమించిన సిబ్బంది డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీశారు. ప్రమాదంలో డ్రైవర్ కాలు విరిగింది. అతడ్ని వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. అసిస్టెంట్ జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, లీడింగ్ ఫైర్ మెన్ సురేష్, రెస్క్యూ టీం సభ్యులు మురళి, శ్రీహరి, గోపి, దేవకుమార్ తదితరులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఎస్సై అంకమరావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా వెంకటేశ్వరుని కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత ఆమలక లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో 60వ హరే రామనామ సప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రఘునాథచార్యులు శాస్త్రోక్తంగా వేదమంత్రాల మధ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా వేదమంత్రాల మధ్య నిర్వహించారు. కల్యాణానికి ఉభయాదాతలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అన్నప్రసాద వితరణ దాతలుగా గిద్దలూరు ఎమ్మెల్యే అన్న రాంబాబు, జి.లక్ష్మిరెడ్డి వ్యవహరించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షులు డీవీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం చెంచయ్య, కోశాధికారి ఏర్వ వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. భక్తులు కల్యాణంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.